సాక్షి సిద్దిపేట

బుధవారం ၊ 1 ၊ నవంబర్ ၊ 2023



చెరుకు రైతు..

జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర కర్మాగార విధానాలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి.

వివరాలు 10లో ▸



మళ్లీ గెలుస్తా..

దుబ్బాక ప్రజల ప్రేమాభిమానాలతో మళ్లీ గెలుస్తానని బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు.

వివరాలు 10లో ▸



ఇందిరా గాంధీకి ఘన నివాళి

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

మల్లన్నస్వామి లడ్డూ మరింత ప్రియం

డిసెంబర్ 1 నుంచి పెరగనున్న ధరలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో డిసెంబర్ 1 నుంచి లడ్డూ ప్రసాదం ధర పెంచనున్నట్లు ఆలయ ఈవో బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో విక్రయిస్తున్న 100 గ్రాముల లడ్డూను రూ.20 నుంచి రూ.25 లకు పెంచుతున్నామని తెలిపారు. నూతనంగా అభిషేకం లడ్డూ 400 గ్రాములు రూ.100 కు విక్రయించనున్నట్లు పేర్కొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తున్న రిటర్నింగ్ అధికారి బెన్‌షాలోం

హుస్నాబాద్‌రూరల్: ఎన్నికల అధికారులకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన తప్పనిసరి అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీఓ బెన్‌షాలోం అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. మొత్తం 208 మంది పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఉదయం 108 మందికి, మధ్యాహ్నం 100 మందికి తరగతులను నిర్వహించి వారికి వచ్చిన సందేహాలను రిటర్నింగ్ అధికారి నివృత్తి చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై పూర్తి అవగాహన ఉంటే పోలింగ్ కేంద్రంలో ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

బహుజనుల ఐక్యత చాటుదాం

డీఎస్పీ అభ్యర్థి వెంకట ప్రసన్న



ఎన్నికల ప్రచారంలో డీఎస్పీ అభ్యర్థి వెంకట ప్రసన్న

మిరుదొడ్డి(దుబ్బాక): బహుజనుల అభ్యున్నతి కోసం ముందడుగు వేస్తున్న తనకు 'ఒక ఓటు ఒక నోటు' ఇచ్చి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) దుబ్బాక అభ్యర్థి వేముల వెంకట ప్రసన్న ఓటర్లను అభ్యర్థించారు. మండల పరిధిలోని ధర్మారం, కాసులాబాద్‌లో మంగళవారం వినూత్న రీతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాన్సీరాం కోరుకున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల రాజ్యాధికారం ఒక్క ధర్మ సమాజ్ పార్టీతోనే సాధ్యమన్నారు. బహుజనులు ఏక తాటితో సమ సమాజ స్థాపనకు శ్రీకారం చుట్టి ధర్మ సమాజ్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు చందు, ప్రశాంత్, విజయ్, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం లేదా?



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని చికిత్స నిమిత్తం నగరానికి తరలించడం విడ్డూరంగా ఉందని, సిద్దిపేటలోని వెయ్యి పడకల ఆస్పత్రి ఉండగా అక్కడికి తరలించడం ఏమిటని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ప్రశ్నించారు. మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగరాజు మాట్లాడారు. రాజకీయంలో గెలుపు ఓటములు సహజమని, హత్యా రాజకీయాలు తగవని ఆయన నాగరాజు అన్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వెయ్యి పడకల ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందించాల్సి ఉండగా, హైదరాబాద్‌లో చికిత్స అందించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రులపై బీఆర్ఎస్ నాయకులకు నమ్మకం లేదా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో చిన్నకోడూరు మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బంద్‌తో నిర్మానుష్యంగా దుబ్బాక బస్టాండ్ ప్రాంతం



దుబ్బాకలో పోలీసుల పహారా

నిఘా నీడలో దుబ్బాక

పోలీసుల భారీ బందోబస్తు

- నియోజకవర్గంలో బంద్ ప్రశాంతం
- ఎంపీపై దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్
- ఎంపీ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు

దుబ్బాకటౌన్: నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నియోజకవర్గం వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా జరిగింది. దుబ్బాక పట్టణంతో పాటుగా అన్ని మండలాల్లో స్వచ్ఛందంగా బంద్ జరిగింది. బీఆర్ఎస్ శ్రేణులు దుబ్బాకలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ఘటనకు కారకుడితో పాటు దీని వెనుక దాగి ఉన్న కుట్రను ఛేదించాలంటూ బస్టాండ్ వద్ద ఆందోళనకు దిగారు. స్థానిక బస్‌డిపో నుంచి బస్‌లు బయటకు రాలేవు. అన్ని వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు మూతపడడంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఇదిలా ఉంటే ఎంపీ ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలంటూ ఆలయాలు, మసీద్, చర్చిల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రార్థనలు చేశారు.

సీపీ, ఏసీపీ ఆధ్వర్యంలో...

బీఆర్ఎస్ నాయకులు దుబ్బాక నియోజకవర్గం బంద్‌కు పిలుపు నివ్వడంతో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీపీ శ్వేత, ఏసీపీ సురేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ కార్యాలయాలు, ఎమ్మెల్యే రఘునందన్ రావు నివాసం, క్యాంపు కార్యాలయం ప్రాంతంలో సైతం పటిష్టంగా పోలీసు పహారా కనిపించింది. ప్రధాన రహదారులు, చౌరస్తాలో పదుల సంఖ్యలో పోలీసులు పహారా కాయడం కనిపించింది. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చినప్పటికీ శాంతియుతంగానే నిరసన ర్యాలీ చేపట్టడడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం మీద బంద్ ప్రశాంతంగా జరిగింది.

హత్యారాజకీయాలు సిగ్గుచేటు

హత్యారాజకీయాలను ప్రోత్సహించడం సిగుచేటని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణాగౌడ్ అన్నారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడిని నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టిన అనంతరం వారు మాట్లాడారు. ఎవరికీ ఎలాంటి హాని తలపెట్టని సౌమ్యుడు ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడం దారుణమన్నారు. ఎంపీపై దాడి వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని, పోలీసు అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి దుష్ట శక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకుని మళ్లీ తిరిగిరావాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు.



దుబ్బాకలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

మనకు మనమే పోటీ

- మనది కుటుంబ అనుబంధం
- బీఆర్ఎస్ శ్రేణులతో మంత్రి హరీశ్‌రావు


సిద్దిపేటజోన్: మీరు, నేను వేర్వేరు కాదని, మన మధ్య కార్యకర్త, ఎమ్మెల్యే అనుబంధం కాదని, మనది కుటుంబ అనుబంధమని మంత్రి హరీశ్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పద్మ నాయక, బాలాజీ గార్డెన్‌లో వేర్వేరుగా జరిగిన నియోజకవర్గ పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సిద్దిపేట ప్రగతి చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. సిద్దిపేటలో మనకు ఏ పార్టీతో పోటీ లేదని, మనకు మనమే పోటీ అని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల వారు ఎవ్వరికి వారే పోటీగా భావించి కష్టపడి పనిచేయాలన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో సంక్షేమ పథకాలు అందని గడప లేదన్నారు.

దుబ్బాక గెలుపు బాధ్యత మనదే..

దుబ్బాక అభ్యర్థి, ఎంపీ ప్రభాకర్ రెడ్డి విజయం కోసం సిద్దిపేట కార్యకర్తలు కూడా బాధ్యత తీసుకోవాలని మంత్రి హరీశ్‌రావు ఈ సందర్భంగా సూచించారు. ఎంపీ ప్రభాకర్ రెడ్డి కి అండగా ఉందామని, అక్కడి మీ స్నేహితులు, బంధువులతో మాట్లాడి ఓట్లు వేయించాలని సూచించారు.

దేడ్ లాక్ పక్కా..

అంతకుముందు నియోజకవర్గ ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం పక్కా అని అన్నారు. సిద్దిపేటలో మేము సారథులుగా పనిచేసి లక్షన్నర మెజార్టీ తేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రగతి పుస్తకం ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్ రావు

ఇంటింటికీ 'సిద్దిపేట ప్రగతి'

పదేళ్లలో సిద్దిపేట సాధించిన ప్రగతి పుస్తకం ప్రతి గడప చేరేలా కార్యకర్తలు పనిచేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. మంగళవారం సిద్దిపేటలో నియోజకవర్గ ప్రగతిని వివరించే నవ సిద్దిపేట పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఒక్క పుస్తకం.. ఎన్నో సమాధానాలని అన్నారు. అంతకు ముందు బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నారాయణ రావు పేటకు చెందిన కొంపల్లి పద్మ అనే మహిళ మంత్రికి లక్షన్నర ఓట్ల మెజార్టీ రావాలని ఎల్లమ్మ దేవాలయంలో మొక్కు కట్టారు.

మంత్రి కాన్వాయ్ తనిఖీ



సిద్దిపేటఅర్బన్: ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు మంగళవారం మంత్రి హరీశ్‌రావు కాన్వాయ్‌ను తనిఖీ చేశారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల వద్ద రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు నుంచి సిద్దిపేటకు వస్తున్న మంత్రి కాన్వాయ్‌ను ఆపి మంత్రి వాహనంతో పాటు ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే ఆదారిలో వెళ్తున్న పలు వాహనాలను సైతం పోలీసులు చెక్ చేశారు.

బీజేపీని నమ్మితే కుక్కతోకతో గోదారి ఈదినట్లే





సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్/వర్గల్: బీజేపీని నమ్ముకుంటే కుక్కతోక పట్టుకొని గోదారిని ఈదినట్లే అవుతుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం వర్గల్ మండలం గౌరారంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రసంగిస్తూ రాష్ట్రంలో బీజేపీకి ఒకటి, రెండు సీట్లు కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రజలకు ఎన్నో హామీలిచ్చి...ఒక్కటి కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఆ పార్టీ నేతలు చెప్పే అబద్దపు మాటలను నమ్మవద్దని సూచించారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ఆదర్శమని, దేశంలోనే అత్యధిక పింఛన్లను అందజేస్తున్నది తెలంగాణ మాత్రమేనని అన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీని అన్ని రకాల వసతులతో నిర్మించినట్లు చెప్పారు. నిర్వాసితులకు సంబంధించిన కొన్ని సమస్యలు ఇంకా పరిష్కరించాల్సి ఉందన్నారు. కొందరికి నష్ట పరిహారం చెక్కుల పంపిణీ విషయంలో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. మరికొందరికి కోర్టు కేసుల కారణంగా రిజిస్ట్రేషన్ చేయలేకపోయామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల పంపిణీని పూర్తి చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని మరింతగా అభివృద్ధి చేయడానికి బృహత్ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎం కేసీఆర్‌కు లక్ష ఓట్లకుపైగా మెజారిటీని కానుకగా అందించాలని పిలుపునిచ్చారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- ఎన్నికల శిక్షణ తరగతుల పరిశీలన

దుబ్బాక: ఎన్నికల విధుల్లో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. రెండు రోజుల పాటు ఈ శిక్షణ జరగనుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే అధికారులకు ఈ శిక్షణ ఎంతో ముఖ్యమైందన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా పై అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. మాక్‌పోల్ ప్రక్రియ గురించి క్షుణంగా తెలుసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు గురించి ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. అనంతరం ఎలక్షన్ స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల అధికారి గరీగా అగర్వాల్, ఏఈఆర్‌ఓలు వెంకట్ రెడ్డి, దిలీప్ కుమార్ తదితరులున్నారు.



ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

పత్తి క్వింటాలుకు రూ.7,150

గజ్వేల్: గజ్వేల్‌లో పత్తి క్వింటాలుకు రూ.7,150 ధర పలికింది. మంగళవారం పట్టణంలోని వాసవీ ఇండస్ట్రీస్ 120 క్వింటాళ్లు, ఈశ్వరసాయి ఇండస్ట్రీస్ 150 క్వింటాళ్ల పత్తిని రైతుల వద్ద కొనుగోలు చేసి ఈ ధరను చెల్లించారు. ప్రభుత్వ మద్దతు రూ.7,020 ఉండగా.. సీజన్ ఆరంభంలోనే ధర ఆశాజనకంగా ఉండటం, మరికొద్ది రోజుల్లో మరింత పెరగవచ్చుననే రైతులు ఎదురుచూస్తున్నారు. కొనుగోళ్ల తీరును స్థానిక మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ పరిశీలించారు.



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ

అల్లాదుర్గంను సంగారెడ్డి జిల్లాలో కలపాలి

యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు



ఆందోళన చేస్తున్న చిల్వెర యువకులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని చిల్వెర గ్రామా నికి చెందిన యూత్‌కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అల్లాదుర్గం మండలం సంగారెడ్డి జిల్లాలో కలిపేందుకు అందోల్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ రాజనర్సింహను డిమాండ్ చేస్తామన్నారు. మెదక్ జిల్లాలో ఉండడంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు డిమండ్ చేసి, ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. సమావేశంలో రఘువీర్, సంగమేశ్వర్, శశిధర్‌రెడ్డి, వంద మంది స్థానిక యువకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సమక్షంలో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన యువకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తెలంగాణ రాష్ట్రా సాధనలో కీలకపాత్రను పోషించిన యువకులు ధరావత్ తిరుపతినాయక్, భూక్య రమేష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి మంగళవారం హైదరబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గిరిజనులను బీఆర్ఎస్ పార్టీ ఓటు బ్యాంక్‌గా వాడుకుంటోందని ఆరోపించారు. పొన్నం ప్రభాకర్ విజయానికి సైనికులా పనిచేస్తామని పార్టీలో చేరినవారు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల తిరుగుబావుటా!

- దుబ్బాక 'హస్తం'లో అసమ్మతి రాగం
- మామిడితోటలో రహస్య సమావేశం
- అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి ఒంటెత్తు పోకడపై ఆగ్రహం
- అభ్యర్థిని మార్చకుంటే.. సహకరించేది లేదంటూ స్పష్టీకరణ!



మామిడితోటలో కాంగ్రెస్ అసమ్మతి నాయకుల సమావేశం

దుబ్బాకటౌన్: దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిపై పార్టీ సీనియర్ నాయకులు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. టికెట్ వచ్చి ఇన్ని రోజులు అవుతున్నా తమను పట్టించుకోకపోవడంపై సీనియర్లు మండిపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం దౌల్తాబాద్-రాయపోల్ మండలాల మధ్య తిమ్మక్కపల్లి-ముబారాస్‌పూర్ శివారులో వరలక్ష్మీఫాం హౌస్‌లో సమావేశమయ్యారు. చెరుకు శ్రీనివాస్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తినట్లు తెలిసింది. దుబ్బాక కాంగ్రెస్‌లోని పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కత్తి కార్తీక గ్రూపులకు చెందిన సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కిష్టారెడ్డి, చెరుకు కొండల్ రెడ్డి, రాజిరెడ్డి, పెంటారెడ్డి, కర్నాల శ్రీనివాస్, శ్రీధర్, అశోక్‌రెడ్డి, బాబుతో పాటు సుమారు 150 మందికి పైగా నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు వినికిడి. వీరంతా భవిష్యత్ నిర్ణయంపై చర్చించుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఏ పార్టీ టికెట్ ఇస్తే ఆ పార్టీలోకి వెళ్లే తత్వం ఉన్న శ్రీనివాస్‌రెడ్డికి అధిష్టానం టికెట్ ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. రేపు గెలిచినా కాంగ్రెస్‌లో ఉంటాడన్న గ్యారంటీ లేదని, ఇలాంటి వ్యక్తికి తాము ఎట్టి పరిస్థితుల్లో సహకరించేది లేదని నిర్ణయించుకున్నట్లు అసమ్మతి వర్గాల ద్వారా అందిన సమాచారం. ఇప్పటికైనా అధిష్టానం మేల్కొని శ్రీనివాస్‌రెడ్డికి బీ ఫారం ఇవ్వవద్దని, ఒక వేళ అతన్నే కొనసాగిస్తే తాము సహకరించేది లేదని గట్టిగా నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ అసమ్మతి సమావేశానికి శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కార్తీక హాజరుకానప్పటికీ వారి వర్గాలకు చెందిన ముఖ్య నాయకులు హాజరుకావడం వెనుక పలు సందేహాలకు దారి తీస్తోంది. శ్రీనివాస్‌రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెట్టుకున్న అసమ్మతి సమావేశం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలు..వారు తీసుకున్న నిర్ణయాలు మీడియాకు సైతం లీక్ చేయడం కూడా పథకం ప్రకారమే జరిగినట్లు తెలుస్తుంది.

క్లుప్తంగా

డిపాజిట్లు గల్లంతే



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మునిపల్లి(అందోల్): ప్రజల దీవెనలతో కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పోచారం యాదమ్మ, సురేష్, కర్నార్ల కేశవరావు, మ్యాతరి కుమార్, తాలెల్మ మల్లయ్యతో పాటు తదితరులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను కేంద్రంతో పాటు ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికలలో ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవని హితువు పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీనాక్షి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, శంకర్, విజయ్‌కుమార్, రాజు, కార్తీక్, యేసు, చిన్నమల్లయ్య, బుచ్చయ్య, నాగేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు

జహీరాబాద్: బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. మంగళవారం శేఖాపూర్, లచ్చానాయక్, ఆనెగుంట, అర్జున్‌నాయక్ తండాల్లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం, ఐడీసీ చైర్మన్ ఎండీ.తన్వీర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ దేవిప్రసాద్‌లతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల నుంచి సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమం కోసం పాటుపడ్డారని తెలిపారు. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, శంకర్ నాయక్, గుండప్ప, పెంటారెడ్డి, మచ్చేందర్, శెట్టి రాథోడ్, హీరూ రాథోడ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో అధికారంలోకి..



మాట్లాడుతున్న చంద్రశేఖర్

జహీరాబాద్: కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి ఏ.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని హోతి(కె), నాగిశెట్టి, శేఖాపూర్ తండాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రేషన్‌కార్డు ఉన్న మహిళలందరికీ ప్రతినెలా రూ.2,500 అందిస్తామన్నారు. రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారం అందిస్తామన్నారు. దశాబ్దకాలం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, పార్టీ మండల అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

చెరుకు రైతు.. బతుకు బరువు



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన పీపుల్స్ ఎజెండా కార్యక్రమంలో పాల్గొన్న చెరకు రైతులు

- సాగు నుంచి క్రషింగ్ వరకు అన్నీ అవస్థలే..
- కష్టంగా మారిన పంట అమ్మకం
- అమ్మినా.. బిల్లులు అందక అష్టకష్టాలు
- అప్పులకు వడ్డీలు కట్టలేక ఆవేదన
- వచ్చే సీజన్‌లో క్రషింగ్‌పై అనుమానాలు
- సమస్యలు పరిష్కరించాలని రైతుల వేడుకోలు

సాక్షి పీపుల్స్ ఎజెండా

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర కర్మాగార విధానాలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. పంట సాగు నుంచి క్రషింగ్‌కు తరలించే వరకు అనేక ఇబ్బందులు పడుతున్నా ఫలితం అందుకు అనుగుణంగా ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ కర్మాగారంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 20వేల మంది ఆధారపడి ఉన్నారు. సుమారు 6500 మంది రైతులు చెరకు పంటను సాగు చేస్తున్నారు. 2022–23 క్రషింగ్ సీజన్‌కు గాను రైతులు కర్మాగారానికి చెరకు పంటను సరఫరా చేశారు. అయినా యాజమాన్యం పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాజమాన్యం రూ.9కోట్ల మేర బకాయి పడింది. 2023–24 క్రషింగ్ సీజన్ మరో వారం రోజుల్లో ప్రారంభం కాబోతున్నా గత ఏడాది బిల్లులు ఇంకా చెల్లించలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి అష్టకష్టాలు పడుతున్నారు. క్రషింగ్ కోసం ఏర్పాట్లు కూడా చేపట్టడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ ఇబ్బందులను దూరం చేయాలని చెరకు రైతులు కోరుతున్నారు.

ఉద్యమాలు చేసినా సమస్య తీరలే



చెరకు బకాయిల కోసం ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించడం లేదు. జిల్లా మంత్రి కూడ పట్టించుకోవడం లేదు. యాజమాన్యం నుంచి రైతులకు రూ.9కోట్ల బకాయి పడింది. వీటిని వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలి.

–జి.కొండల్‌రెడ్డి, రైతుసంఘం నాయకుడు, జహీరాబాద్

ఇబ్బంది పడుతున్నాం



చెరకు సాగు కోసం అప్పులు చేశాం. బకాయిలు చెల్లించక పోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయి. రూ.3లక్షల వరకు రావాల్సి ఉంది. కర్మాగారంలో ఉత్పత్తి అయిన చక్కెర, మొలాసిస్‌ను యాజమాన్యం అమ్ముకున్నా బిల్లులు చెల్లించక పోవడం అన్యాయం.

–బి.జైపాల్‌రెడ్డి, రైతు, మిర్జాపూర్, న్యాల్‌కల్ మండలం

క్రషింగ్ నిర్వహించడం అనుమానంగానే ఉంది



ఈ ఏడాది కర్మాగారంలో క్రషింగ్ ప్రారంభించడం అనుమానంగానే ఉంది. పూర్తి స్థాయిలో మరమ్మతులు కొనసాగడం లేదు. కర్మాగారం యంత్రాలు స్క్రాప్ కింద అమ్మకం పెడుతున్నారనే ప్రచారం సాగుతున్నది. కర్మాగారంలో కరెంటు సరఫరా కూడ లేదు.

–సి.గుండ్‌రెడ్డి, రైతు, మామిడ్గి, న్యాల్‌కల్ మండలం

క్రషింగ్ కొనసాగించాలి



ఈ ఏడాది కర్మాగారంలో క్రషింగ్‌ను ప్రారంభించాలి. సీజన్ దగ్గర పడుతున్నా కర్మాగారంలో చేపట్టిన మరమ్మతులు సక్రమంగా కొనసాగడం లేదు. క్రషింగ్ చేపడితేనే ఇతర కర్మాగారాలు గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేస్తాయి. లేదంటే తీవ్రంగా నష్టపోతాం.

–బి.మాధవరెడ్డి, రైతు, జహీరాబాద్

పెట్టుబడికి అప్పు పుట్టడం లేదు



కొత్తగా చెరకు పంటను సాగు చేసుకునేందుకు పెట్టుబడుల కోసం అప్పులు పుట్టడం లేదు. గతంలో చేసిన అప్పులకు రెండేళ్లుగా వడ్డీలు కడుతున్నాం. సకాలంలో కూలీ డబ్బులు ఇవ్వక పోవడంతో కూలీలు కూడ పనులకు రావడం లేదు.

–డి.రామకృష్ణారెడ్డి, రైతు, అల్గోల్, జహీరాబాద్ మండలం

నమ్మకం లేక పక్క కర్మాగారాలకు



ఇక్కడి కర్మాగారంపై నమ్మకం కుదరకే కర్ణాటకకు తరలించాల్సి వస్తుంది. యాజమాన్యం రైతులకు భరోసా ఇవ్వక పోవడంతో నమ్మకం కోల్పోతోంది. పక్క రాష్ట్రాల్లోని యాజమాన్యాలు బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నాయి.

–ఆనందీశ్వర్, రైతు, వడ్డి, న్యాల్‌కల్ మండలం

వడ్డీ కట్టలేకపోతున్న



గత ఏడాది 1500 టన్నుల చెరకును సరఫరా చేశా. ఇంకా రూ.9.50 లక్షల మేర బకాయిలు రావాల్సి ఉంది. ఎన్ని సార్లు అడిగినా అధికారులు, యాజమాన్యం స్పందించడం లేదు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి వడ్డీలు కట్టలేకపోతున్నం.

–కె.మధుసూదన్‌రెడ్డి, రైతు, అల్గోల్, జహీరాబాద్ మండలం

అగ్రిమెంట్ చేసుకోవడం లేదు



సాగులో ఉన్న పంటకు యాజమాన్యం అగ్రిమెంట్ చేసుకోవడం లేదు. క్రషింగ్ అనుమానంగానే ఉంది. కర్ణాటకలోని యాజమాన్యం అగ్రిమెంట్ కోసం ముందుకు వచ్చింది. దీంతో వారితో ఒప్పందం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

–నాగేశ్వర్‌రెడ్డి, రైతు,రంజోల్, జహీరాబాద్ మండలం

సబ్సిడీ మందులు ఇవ్వడం లేదు



చెరకు పంటలో కలుపు తొలగించేందుకు సీడీసీ తరపున సబ్సిడీపై ఇచ్చే మందులను ఇవ్వడం లేదు. ఇచ్చినా మొక్కుబడిగానే ఉంటున్నాయి. చెరకు కష్టాలు తీరాలంటే ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

–సలావుద్దీన్, రైతు, గోవింద్‌పూర్, జహీరాబాద్ మండలం

స్టెప్పులేసిన బీజేపీ అభ్యర్థి



నృత్యం చేస్తున్న మురళీయాదవ్

నర్సాపూర్: నర్సాపూర్ బీజేపీ అభ్యర్థి మురళీ యాదవ్ కళాకారులతో కలిసి స్టెప్పులేసి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. మంగళవారం స్థానిక ఓ ఫంక్షన్ హాలులో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఈశ్వర్‌సింగ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కళాకారులు ఆడిపాడుతుంటే.. వారితో కలిసి మురళీయాదవ్ కొద్దిసేపు నృత్యం చేశారు. దీంతో కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా ఈలలు వేశారు.

ఎంపీ గన్‌మెన్లకు ఎస్పీ అభినందన



గన్‌మెన్లను సన్మానిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి: ప్రాణాలకు తెగించి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని కాపాడిన పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్ (గన్‌మెన్) ప్రభాకర్, గంగారాంలను ఎస్పీ రూపేష్ మంగళవారం రివార్డులు అందజేశారు. సూరంపల్లి గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మీటింగ్ అనంతరం ఎంపీ తన కారు వద్దకు చేరుకోగానే ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పక్కనే ఉన్న గన్‌మెన్స్ తక్షణమే స్పందించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రభాకర్ గాయపడ్డాడు. గన్‌మెన్లు అప్రమత్తం కావడంతో ఎంపీకి ప్రాణాపాయం తప్పింది. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందించారు.

నామినేషన్ల పర్వానికి సర్వం సిద్ధం

- 3 నుంచి తహసీల్దార్ కార్యాలయంలో స్వీకరణ
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా



ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా



కార్యాలయంలో ఫిర్యాదు స్వీకరణ కేంద్రం

పటాన్‌చెరు టౌన్: నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుందని తెలిపారు. ఇందుకోసం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. నవంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు సమర్పించవచ్చని తెలిపారు. నవంబర్ 5 సెలవు రోజు కావడంతో నామినేషన్లు స్వీకరణ ఉండదని వివరించారు. 13న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ 14, 15న మధ్యాహ్నం మూడు గంటలకు ఫైనల్ జాబితాను విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఫిర్యాదుల కోసం 08455–242005కు సమాచారం ఇవ్వాలన్నారు.

విధి విధానాలు

✦ ఎమ్మెల్యేగా ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థి తన నేరచరిత్ర, సమోదైన పోలీస్ కేసులతోపాటు కోర్టు విచారణలో ఉన్న కేసు వివరాలు భార్యా పిల్లలు స్థిర, చర ఆస్తులు, అప్పులు, బ్యాంకు డిపాజిట్, నగదు నిల్వలు వివరాలు కూడా సమర్పించాల్సి ఉంటుంది.

✦ నామినేషన్‌ను ఆన్‌లైన్‌లో నింపి.. వాటి జిరాక్స్ ప్రతులు సమర్పించాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేసుకోవచ్చు.

✦ నామినేషన్ ఫారాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి పొందవచ్చు.

✦ నామినేషన్ పత్రంతోపాటు ఫారం -2బీ సమర్పించాలి. నామినేషన్ ఫారంలో ఫారం- 26 అఫిడవిట్ జతపరచాల్సి ఉంటుంది.

✦ రూ.10 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ పై అఫిడవిట్‌ను సమర్పించాలి.

✦ అభ్యర్థి రెండు స్టాంపు సైజు ఫొటోలను ఇవ్వాలి. ఒకటి నామినేషన్ ఫారం పైన రెండోది అఫిడవిట్ పైన అతికించాలి.

✦ నామినేషన్ వేసే అభ్యర్థి ప్రత్యేకంగా ఒక బ్యాంకు ఖాతాను తెరిచి ఎన్నికల కోసం పెట్టే ఖర్చులు అందులో నుంచి చూపాలి.

✦ అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి అదే నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలి. జాతీయ లేదా రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ తరపున పోటీ చేసేవారు నామినేషన్ వేస్తే వారిని ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. అదే స్వతంత్ర అభ్యర్థి అయితే పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది.

✦ నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థితోపాటు నలుగురిని మాత్రమే కార్యాలయంలోనికి అనుమతిస్తారు.

✦ అభ్యర్థి అగ్రవర్ణం లేదా బీసీ అయి ఉంటే రూ.10 వేలు, ఎస్సీ ఎస్టీలకు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి. రుసుంను బ్యాంకు చలానా రూపంలో చెల్లించాలి. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు సంబంధిత అధికారి చేత కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి.

ప్రజల ప్రేమాభిమానాలతో మళ్లీ గెలుస్తా

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు



ప్రచారం చేస్తున్న రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: చిల్లర రాజకీయాలు, కుట్రకుతంత్రాలు చేసే వ్యక్తిని కానని, దుబ్బాక ప్రజల ప్రేమాభిమానాలతో మళ్లీ గెలుస్తానని బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లితో పాటు మండలంలోని అప్పనపల్లి, హసన్‌మీరాపూర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తాను ఉప ఎన్నికల్లో గెలిచిన రెండున్నరేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల బాగోగులు చూసుకుంటూ ముందుకు సాగుతున్నానన్నారు. పథకం ప్రకారం తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తనను మరోసారి గెలిపిస్తే జనం కష్టసుఖాల్లో అండగా ఉంటానన్నారు.

ఆ పార్టీలను నమ్మితే మునిగినట్లే..

బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు

సదాశివపేట(సంగారెడ్డి): నయవంచనకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్, బీజేపీలు అని, వాటిని నమ్మితే నట్టేట ముంచుతాయని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం శివరాజ్‌పాటిల్ ఆధ్వర్యంలో 100 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈసందర్భంగా శివరాజ్ పాటిల్, సీహెచ్ సత్యనారాయణ, ప్రభుగౌడ్‌లను శాలువాలతో సన్మానించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ.. గులాబీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. 60ఏళ్ల పాలించిన కాంగ్రెస్ వల్ల తెలంగాణ ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారని, మతం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అభిపాటిల్, సాయిపాటిల్, గందిగరాజు, జలీల్, పన్నీగౌడ్, కే.రాంరెడ్డి, జైపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, చీల మల్లన్న, అంజనేయులు, ఆకుల శివకుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రజా సంక్షేమం కోసం పనిచేసే సీఎం కేసీఆర్‌ను గజ్వేల్‌లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో బుధవారం ప్రారంభించే ఎన్నికల ప్రచార నిర్వహణలో భాగంగా ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కేసీఆర్ అత్యధిక మెజారిటీ సాధించేందుకు ప్రజల వద్దకు ఎలా వెళ్లాలనే విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కుకునూరుపల్లి మండలం కావాలనే ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కళను మంత్రి హరీశ్‌రావు చొరవతో సీఎం సాకారం చేశారన్న విషయాన్ని ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, సర్పంచ్ కిరణ్‌కుమార్ చారి,కోల శ్రీనివాస్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కనుకయ్య, ఎంపీటీసీ భూములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల అధికారుల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియ వందశాతం సజావుగా సాగేందుకు ఈ ట్రైనింగ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సందేహాలుంటే ఉన్నతాధికారులతో చర్చించాలని సూచించారు. ప్రతీ ఎన్నికల్లో కొత్త మార్గదర్శకాలు, నిబంధనలు వస్తుంటాయని, అవి కీలకంగా ఉంటాయని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్, ఆర్డీఓ రమేష్, తహసీల్దార్ దిలీప్, మున్సిపల్ కమిషనర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో గొడవలు సృష్టిస్తున్న మైనంపల్లి

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి



ప్రచారంలో డప్పు వాయిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): ప్రశాంతంగా ఉన్న మెదక్‌ను మైనంపల్లి వచ్చి గొడవలు పెడుతున్నాడని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని నస్కల్, జెడ్ చెరువు తండా, నందగోకుల్, నగరం గ్రామాలలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటు అందిస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు 3గంటలు చాలంటున్నారని తెలిపారు. అదే విధంగా రైతుబంధు నిలిపివేయాలని చూస్తున్నారన్నారు. ప్రజలు ఇకనైనా హస్తం పార్టీ కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పాలనను ప్రజలు నచ్చడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు, పరిపాటి సుధాకర్‌రెడ్డి, అందె కొండల్‌రెడ్డి, భాజ చంద్రం, బాపురెడ్డి, సులోచన, భాస్కర్‌రావు, కవిత, బాల్ నర్సవ్వ, అనూష, గేమ్ సింగ్, చంద్రవర్ధిని, నరసవ్వ, గౌస్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇక్కడ 'కోడ్' వర్తించదా?

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కోడ్ అమలులో ఉంటే మండల పరిధిలోని వేచరేణి, గుర్జకుంట గ్రామాల్లో మాత్రం అది కనిపించడం లేదు. ఇందుకు నిదర్శనం ఈ ఫొటోలు. సిద్దిపేట జనగామ ప్రధాన రహదారి పక్కనే ఉన్న పౌల్ట్రీ ఫాం గోడలపై రాతలను తుడిచివేయకుండా వదిలేసిన అధికారుల తీరును చూసి ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. - చేర్యాల(సిద్దిపేట)



గుర్జకుంట శివారులో పౌల్ట్రీ గోడలపై ఉన్న రాతలు



గుర్జకుంట ఎక్స్ రోడ్డులో..



వేచరేణి శివారు కాలనీలో..